క్లుప్తంగా

స్పందనలో రెడ్‌క్రాస్ సేవలు



దివ్యాంగుడిని తీసుకొని వెళ్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో సేవలు ప్రారంభించినట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులకు తమ వినతులను సమర్పించేందుకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని వారిని వీల్ చైర్ సహాయంతో తీసుకొని తమ వలంటీర్లు వెళ్తారన్నారు. కార్యక్రమంలో కె.సత్యన్నారాయణ, ఇంటర్న్‌షిప్ విద్యార్థినులు జి.పవన్, లావణ్య, కల్పన, ప్రమీల, వలంటీర్లు పాల్గొన్నారు.

తెగుళ్ల పరిశీలన

జి.సిగడాం: మొక్కజొన్న పంటకు తెగుళ్లు సోకకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచించారు. సంతవురిటి గ్రామంలో సాగులో ఉన్న పంటను అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్లు ఆశించినట్టు అనుమానం ఉంటే తక్షణమే తమను సంప్రదించాలన్నారు.

ఉమారుద్రుడికి విశేష పూజలు



అభిషేక పూజలు అందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరాన వెంచేసిన ఉమారుద్రకోటేశ్వర స్వామికి మాఘమాస సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు పొన్నాడలో సచివాలయ కన్వీనర్లకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలో మంగళవారం ఉదయం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. ఎచ్చెర్లలో సోమవారం మాట్లాడుతూ.. 12 సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, కన్వీనర్లకు ఎచ్చెర్లలో శిక్షణ పూర్తయిందన్నారు. మరో 14 సచివాలయాల పరిధలో వారికి పొన్నాడలో శిక్షణ ఉంటుందని వివరించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డ పనులు పరిశీలిస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో రూ.2.80 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ మొదలవలస చిరంజీవి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలని గుత్తేదారుకు సూచించారు. సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, మండల విప్ బగ్గు రాజారావు, కాంట్రాక్టర్ సత్తారు గోపి ఉన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వం, దృష్టి లోపం నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం 198 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యం సంరక్షణపై విద్యార్థులకు ఆప్తాలిమిక్ అధికారి ఎం. ఆర్.కె.దాస్ అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఎంఎల్‌హెచ్‌పీ పి.ప్రియాంక ఉన్నారు.

ఆకట్టుకున్న భజన

నరసన్నపేట: కొల్లవానిపేటలో ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో భజనలు స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతీ సోమవారం భజనలు చేస్తున్నామని, దీంట్లో భాగంగా సోమవారం సీతారామ భజన బృందం సభ్యులు కొల్ల గోపి, సురవరపు బైరాగినాయుడు ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.

పథకాలు చెప్పడంలో తప్పులేదు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- సతివాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గార: ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల కోసం వలంటీర్లు చెప్పడంలో తప్పేమీ లేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సతివాడ పంచాయతీలో సర్పంచ్ యాళ్ల సుధారాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉన్నారని.. వీరంతా ప్రభుత్వం ఎలా పనిచేస్తోంది, పథకాలు ఎవరు ఇస్తున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. పొరపాటున చంద్రబాబు వస్తే తొలుత వలంటీర్లపైనే తుపాకీ పేలుతోందన్నారు. అందుకే మన దగ్గర ఉన్న తుపాకీని మనమే ముందుగా పేలిస్తే సరిపోతుందన్నారు.



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

అందరికీ సంక్షేమం

అందరికీ సంక్షేమం అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. సతివాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, పీస శ్రీహరిరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, పీస గోపి, గొండు జయరాం, ఎంపీటీసీ సభ్యుడు పాదిలాపు శ్రీరాములు, అందవరపు బాలకృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సమర్పించే తలపాగా పనులకు శ్రీకారం



మగ్గంపై తలపాగా నేస్తున్న చేనేత కార్మికులు

లావేరు: శ్రీశైలంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి సమర్పించడం కోసం లావేరు గ్రామానికి చెందిన పలువురు చేనేత కార్మికులు మగ్గంపై తలపాగాను నేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పెద్దవీధికి చెందిన చేనేత కార్మికులు కాశిన వెంకటరమణ, సవర్రాజు కుటుంబ సభ్యులు ఏటా శివరాత్రి రోజున మల్లికార్జున స్వామికి తలపాగాను మగ్గంపై నేసి అందజేయడం ఆనవాయితీ. దానిలో భాగంగా ఈ ఏడాది కూడా తలపాగాను అందజేయడం కోసం సోమవారం నుంచి పనులు ప్రారంభించారు. భక్తి శ్రద్ధలతో తలపాగా నేత పనులు పూర్తి చేసి గ్రామంలో తిరువీధి నిర్వస్తామని.. తరువాత శ్రీశైలం వెళ్లి స్వామికి సమర్పిస్తామని నేత కార్మికులు వెంకటరమణ, సవర్రాజు చెప్పారు. తలపాగా నేత పనుల్లో కార్మికులు కాశిన పద్మ, లక్ష్మి, శంకరరావు, దోర ప్రకాశం, రమణమ్మలు సహకరిస్తున్నారన్నారు.

జీవాలకు ఉచితంగా పీపీఆర్ వ్యాక్సిన్



లింగాలవలసలో మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

లావేరు: గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేస్తోందని లావేరు, బెజ్జిపురం పశువైద్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ బి.గాయత్రి, జి.లావణ్య అన్నారు. ఈ రెండు కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం వెటర్నరీ జూనియర్ అధికారి, సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్ చేశారు. పశువైద్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి సోకకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి పీపీఆర్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తోందని.. యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం పశు వైద్య ఉపకేంద్రం వెటర్నరీ జూనియర్ అధికారి రవికుమార్, వెటర్నరీ అసిస్టెంట్లు జి.గోపాల్ పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లపై సిబ్బందికి శిక్షణ



శిక్షణ పొందుతున్న సచివాలయ సిబ్బంది

రణస్థలం: గ్రామ సచివాలయాల్లో భూముల క్రయ విక్రయాలు జరిపేందుకు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కె.వేణు తెలిపారు. ఇందులో భాగంగా రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ ద్వారా సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూముల క్రయ విక్రయాలకు సంబంధించిన డ్యాక్యుమెంట్లు ఎలా రిజిస్ట్రేషన్ చేయాలనేది గత ఐదు రోజులుగా తర్ఫీదు ఇవ్వడం జరిగిందన్నారు. భూముల క్రయ విక్రయాలు జరపాలంటే ఏ డాక్యుమెంట్లు అవసరమో తెలియజేశామన్నారు. అలాగే ఖాళీస్థలాలకు, వ్యవసాయ భూములకు, లేఅవుట్లు, వ్యవసాయేతర భూములు, ఇళ్ల స్థలాలకు ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేయాలో క్షుణ్ణంగా ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్లలో వివరించామన్నారు. ప్రభుత్వ స్థలాలు, న్యాయస్థానం కేసుల్లో ఉన్న వంటి వివిధ నిషిద్ధ భూములకు రిజిస్ట్రేషన్లు చేయకూడదని తెలియజెప్పామన్నారు. శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. రిజర్వేషన్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆరో వార్డు బొందిలీపురం-2 (ఓసీ), 25వ వార్డు చల్లవీధి (ఓసీ), 31వ వార్డు కెల్లవీధి (ఓసీ), 7వ వార్డు పెద్దరెల్లివీధి-1 (బీసీ-డీ), 14వ వార్డు చౌక్‌బజారు (ఓసీ)లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈనెల 11వ తేదీ సాయంత్రంలోగా ఐసీడీఎస్, శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఎల్.ఎన్.పేట: సెల్‌ఫోన్ ద్వారా నగదు రహిత లావాదేవీలను నిర్వహించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆంధ్ర ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ సోమయాజులు అన్నారు. సోమవారం లక్ష్మీనర్సుపేట గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ ఖాతాదారులందరూ ఆర్థిక అక్షరాస్యతను కలిగి ఉండాలన్నారు. గ్రామీణ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు కోసం అవగాహన కల్పించారు. అటల్ పెన్షన్ యోజన, సోషల్ సెక్యూరిటీ స్కీమ్ గురించి ఖాతాదారులకు తెలియజేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ పొందిన సాహుకారి లతకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. లక్ష్మీనర్సుపేట బ్రాంచ్ మేనేజర్ సందీప్, ఫీల్డ్ ఆఫీసర్ హేమలక్ష్మి, ఆఫీస్ అసిస్టెంట్ సంధ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- జాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



జాడలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జాడ సచివాలయం పరిధిలోని ముక్కుపేట, జాడ గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..లేదాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌కు రెండు కళ్లలాంటివన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, పార్టీ నాయకులు లంకలపల్లి ప్రసాదరావు, బూరాడ వెంకటరమణ, కోర్రాయి అప్పారావు, ఇజ్జి కోటి, ఇన్‌చార్జి ఎంపీడీవో పూజారి రామ్మోహనరావు, ఏపీవో బొర్ల సత్యన్నారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, పంచాయితీ కార్యదర్శి గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

ఆమదాలవలస: మండలంలోని మందాడి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి వేతనదారుల కుటుంబాలకు స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందజేస్తామన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి తాను స్వయంగా సర్పంచ్, ఎంపీటీసీలతో మాట్లాడి సహాయ, సహకారాలు అందించామన్నారు. తన కుమారుడు చిరంజీవినాగ్ వివాహం జరిగి ఆరు నెలలు పూర్తికాలేదన్న కారణంతోనే మృతదేహాల వద్దకు వెళ్లలేకపోయాయని వివరించారు. కొంత మంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి సున్నితమైన విషయాలను రాజకీయ కోణంలో చూడటం తగదన్నారు. ఇలాంటి విషయాలు మానవతా దృక్పథంతో పరిగణించాలన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది రోజున ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు చేపడుతున్నామని గృహ నిర్మాణ శాఖ ఈఈ పి.జి.జె.మోహన్‌రావు తెలిపారు. వల్లభరావుపేట గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాల్లో వెయ్యికి పైగా శ్లాబ్ లెవెల్ పూర్తయిన మండలాల్లో రణస్థలం మూడో స్థానంలో ఉందని చెప్పారు. మండలంలో 2,829 ఇళ్లకు 1007 పూర్తయినట్టు పేర్కొన్నారు. మరో 200 శ్లాబ్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. వీటిని కూడా ఉగాది నాటికి పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎం.మోహన్‌రావు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నెమలి పింఛంపై 'కళాతపస్వి'



భారతీయ సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్. ఆయనకు నివాళులర్పిస్తూ అరసవల్లికి చెందిన రాహుల్ పట్నాయక్ జాతీయ పక్షి నెమలి పింఛంపై విశ్వనాథ్ సూక్ష్మ చిత్రాన్ని ఒక అంగుళం సైజులో చిత్రీకరించారు. దీన్ని వేసేందుకు రెండు గంటల సమయం పట్టిందని తెలిపారు.

–శ్రీకాకుళం కల్చరల్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కన్వీనర్లు, గృహ సారథులకు సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు

- గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అల్లినగరం, అరిణాంఅక్కివలస, చిలకపాలెం, ఎచ్చెర్ల, ఎస్‌ఎం పురం, కేశవరావుపేట, ఫరీదుపేట, ఇబ్రహింబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, జరజాం, ఎస్ఎస్ఆర్ పురం సచివాలయాల పరిధిలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎచ్చెర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచార సామగ్రిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి పాలనకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అర్హత గల ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు పార్టీ క్యాడర్ సన్నద్ధం కావాలన్నారు. పార్టీ కోసం శ్రమిస్తున్న వారిని గుర్తించి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లుగా నియమించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. 15 రోజుల్లో ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేయాలన్నారు. వలంటీర్లు సైతం బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జరగుళ్ల శంకరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, ఎంఎం పురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, వైస్ ఎంపీపీ జరగుళ్ల విజయకుమారి, జి.సిగడాం జేసీఎస్ ఇన్‌చార్జి డోల వెంకటరమణ, ఎచ్చెర్ల సర్పంచ్ తండ్యాన జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు దన్నాన ఈశ్వరమ్మ, కూన ఈశ్వరమ్మ, కింతలి ఈశ్వరరావు, సీరపు శ్రీరాంమూర్తి, మాడుగుల స్వాతి, సర్పంచ్‌లు టిగుటి మణి, కోన సూర్యారావు, అల్లు కన్నబాబు, నాయకులు మాగుల మురళీధర్‌బాబా, నేతింటి నీలం, డొంక వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ యుగంధర్

నరసన్నపేట: మండలంలోని 34 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. సోమవారం నాటికి 2,412 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. రోజురోజుకీ ఉపాధి వేతనదారుల సంఖ్య పెంచుతున్నామని ఏపీడీ యుగంధర్ అన్నారు. మండలంలోని జమ్ము పంచాయతీ శివరాంపురంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 6.87 లక్షల పని దినాలు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 5.24 లక్షల పని దినాలు కల్పించామన్నారు. మార్చి ఆఖరు నాటికి లక్ష్యానికి మించి పనిదినాలు కల్పిస్తామన్నారు. అలాగే వేతనదారులకు వేతనాలు పూర్తి స్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

పాతపట్నం: మండలంలోని శోభ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు సవర రామారావు, సవర సుక్కు, రామకృష్ణ, రమణ తమకు ప్రత్యేక పంచాయతీ కావాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. శోభ పంచాయతీ పరిధిలోని 12 గిరిజన గ్రామాలు ఉన్నాయని, కొమ్మలగూడ, బూర్జగూడ బెన్నగూడ, లక్ష్మగూడతో పాటు పలు గూడలను కలిసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు.

కర్బుజా సాగుపై రైతుల ఆసక్తి



సుమంతాపురం ప్రాంతంలో కర్బుజా సాగు

ఎల్.ఎన్.పేట: కర్బుజా సాగు పట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో పోల్చితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు చెపుతున్నారు. రబీలో సాగు చేసే వాణిజ్య పంటల్లో లాభాన్ని తెచ్చిపెట్టే కర్బుజా సాగుపై రైతులు ఆసక్తి పెరిగిందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలోని సుమంతాపురం, దబ్బపాడు, శ్యామలాపురం, బరటాం, సిద్ధాంతం తదితర గ్రామాల్లో సుమారు 145 ఎకరాల్లో కర్బుజా సాగవుతుందన్నారు. ఖరీఫ్ వరిచేను కోతలు కోసిన తరువాత పంట పొలాన్ని మెత్తగా దుక్కి చేస్తామన్నారు. బాగా కుళ్లిన గత్తం వేసి మారో సారి దుక్కి చేసి పదును ప్రకారం విత్తనాలు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు. వారం రోజులకు ఒకసారి పురుగుల మందును పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు.